క్లుప్తంగా

నేటి నుంచి శివరాత్రి ఉత్సవాలు



కోటితీర్థంలోని కోటేశ్వరాలయం

చేజర్ల: ఎన్నో శతాబ్దాల చరిత్ర కలిగిన శైవక్షేత్రాల్లో మండలంలోని కోటితీర్థం గ్రామంలో ఉన్న కోటేశ్వరాలయం ఒకటి. మహాశివరాత్రిని పురస్కరించుకుని సోమవారం నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఇక్కడ ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 26న శివరాత్రి సందర్భంగా ప్రత్యేకాభిషేకాలు జరుగుతాయి. అదేరోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు.

హంస వాహనంపై భీమేశ్వరుడు



సంగం: మండలంలోని వంగల్లులో ఉన్న కామాక్షితాయి సమేత భీమేశ్వరుడు శనివారం అర్ధరాత్రి హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో రెండురోజులుగా ఉత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఉత్సవమూర్తులను హంస వాహనంపై కొలువుదీర్చి సుందరంగా అలంకరించారు. అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

ఘనంగా స్కూల్ వార్షికోత్సవం



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

అనుమసముద్రంపేట: మండల కేంద్రమైన ఏఎస్‌పేటలోని ఠాగూర్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ 30వ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి, ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్ దొరస్వామిరెడ్డి, కరెస్పాండెంట్ రమణారెడ్డి, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

ఆత్మకూరు: ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మున్సిపల్ పరిధిలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు ముజీబ్, పాఠశాలల నిర్వాహకులు రామ్మోహన్‌రెడ్డి, కిషన్, నేతాజీ సుబ్బారెడ్డి, ఆలయ ధర్మకర్త సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు మానుకోవాలి

వరికుంటపాడు: ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై కొందరు సొంత పార్టీ నేతలు, ప్రతిపక్షాలు ఆరోపణలు చేయడం మానుకోవాలని, ఆధారాలు ఉంటేనే మాట్లాడాలని టీడీపీ నేతలు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. అగ్రిగోల్డ్ భూముల్లో కలప మాయం వెనుక ఎమ్మెల్యే పాత్ర లేదన్నారు. రేషన్ బియ్యం అమ్ముకుని పార్టీ సభ్యత్వాలు చేయించినట్లు ప్రచారం చేయడం సరికాదన్నారు. అనంతరం ఎమ్మెల్యేపై ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఇన్‌చార్జి ఎస్సై ఇంద్రసేనారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు గొడుగులూరు మాలకొండయ్యరాయుడు, కామేపల్లి వెంకటరత్నం, ఆంధ్ర బాలగురువారెడ్డి, ఆవుల అరుణమ్మ, అరవ ప్రకాశ్, బోగినేని శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.


దరఖాస్తుల పరిశీలన నేడు

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి కెనరా బ్యాంక్ పరిధిలో సబ్సిడీ రుణాలకు సంబంధించి దరఖాస్తుల పరిశీలన సోమవారం ఉదయం జరుగుతుందని ఎంపీడీఓ నాగేశ్వరప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీసీపల్లి, నందవరం, రామానాయుడుపల్లి, పొంగూరు, పొంగూరుకండ్రిక, భీమవరం పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలో దరఖాస్తుదారులకు సమాచారాన్ని తెలిపి సంబంధిత ధ్రువీకరణపత్రాలతో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రమాదకరంగా..

ఉత్తర కాలువపై రాకపోకలెలా?

- డీసీపల్లి సమీపంలో 40 ఏళ్ల క్రితం బ్రిడ్జి నిర్మాణం
- నేడు శిథిలావస్థకు చేరిన వైనం
- సమస్యను పరిష్కరించాలంటున్న జనం



బంట్లపల్లి సమీపంలో రైతులు, జీవాల కాపరులు ఉత్తర కాలువపై ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక వంతెన



వెన్నవాడ వెళ్లే మార్గంలో శిథిలావస్థకు చేరిన వంతెనను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ఆత్మకూరు రూరల్: సోమశిల జలాశయం నుంచి ప్రారంభమయ్యే ఉత్తర కాలువ రాళ్లపాడు ప్రాజెక్ట్ వరకు వంద కిలోమీటర్ల మేర ప్రయాణిస్తుంది. మధ్యలో అనేక ఉపకాలువలకు సాగునీరందిస్తుంది. అలాగే భూగర్భ జలాలను పెంచుతూ రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. అయితే ఆత్మకూరు మండలంలోని పలు ప్రాంతాల్లో ఉత్తర కాలువపై ఉన్న వంతెనలు ప్రమాదకర స్థితికి చేరుకున్నాయి. దీంతో రైతులు, ప్రజలు రాకపోకలు సాగించలేకపోతున్నారు. రోడ్డు రవాణా సౌకర్యం పెంపొందిస్తామని కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు ఆచరణలో కార్యరూపం లేకపోవడంతో సమస్య తీవ్రత పెరుగుతోంది.

కొన్నిచోట్ల ఇలా..

➡ ఆత్మకూరు మండలంలోని బంట్లపల్లి వద్ద మహిమలూరుకు వెళ్లే ఉత్తర కాలువ అక్విడెక్ట్ పైన గతంలో ఉన్న చిన్నపాటి వంతెనను నిర్మించారు. కాలువ వెడల్పు పనుల్లో భాగంగా వంతెనను రెండేళ్ల క్రితం దీనిని కూల్చేశారు. అయితే సంబంధిత కాంట్రాక్టర్లు కాలువ లైనింగ్, వంతెనల విస్తరణ పనులు మధ్యలో వదిలేశారు. దీంతో ఆ మార్గాన వెళ్లే ప్రజలు, రైతులు, జీవాలకాపరులు తామే సొంతంగా చిన్నపాటి వంతెనను కట్టెలు, రేకులతో అమర్చుకొని రాకపోకలు సాగిస్తున్నారు.

➡ అలాగే వెన్నవాడకు జాతీయ రహదారి నుంచి వెళ్లే మార్గంలో సౌకర్యవంతమైన తారురోడ్డు ఉన్నా డీసీపల్లి సమీపంలో ఉన్న ఉత్తర కాలువపై 40 ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుని అత్యంత ప్రమాదకరంగా మారింది. అప్పట్లో నిర్మించిన వంతెన సిమెంట్ కాంక్రీట్ శ్లాబ్ భాగంలో పలుచోట్ల రంధ్రాలు పడటంతో స్థానికులు మట్టి తోలి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలు చేస్తున్నారు. దీనికితోడు చేపట్టు గోడలు శిథిలావస్థకు చేరి కూలిపోయాయి. ఈ నేపథ్యంలో నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉండే ఈ మార్గంలో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



ఉత్తర కాలువపై వెన్నవాడకు వెళ్లే మార్గంలో 40 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన దెబ్బతిన్న మాట వాస్తవమే. సోమశిల ఉత్తర కాలువ విస్తరణ పనుల్లో భాగంగా ప్రభుత్వ అనుమతులతో త్వరలోనే రెండు లైన్ల వంతెనను మరింతగా విస్తరించి కొత్త బ్రిడ్జి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. అలాగే బంట్లపల్లి సమీపంలో రైతులు తాత్కాలికంగా వినియోగించుకుంటున్న కట్టెల వంతెన ప్రభుత్వ ప్రాధాన్యతల్లో లేదు. అయినా నివేదించి తదుపరి చర్యలు తీసుకుంటాం. – మెట్టుకూరు మురళీకృష్ణారెడ్డి, డీఈఈ, సోమశిల ప్రాజెక్ట్ 4వ డివిజన్

మోడల్ స్కూల్స్‌లో అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల



సీతారామపురంలోని ఆదర్శ పాఠశాల

సీతారామపురం: ఆదర్శ పాఠశాలల్లో (ఏపీ మోడల్ స్కూల్స్) 2025 – 26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. జిల్లాలోని పది పాఠశాలల్లో ఒక్కోచోట 100 సీట్ల చొప్పున ఉన్నాయి. ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదివిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ ఎస్టీలు రూ.75 చొప్పున ఫీజు చెల్లించాలి. దరఖాస్తు చేసుకున్న వారికి ఆయా స్కూళ్లలోనే ఏప్రిల్ 20 తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. 27న మెరిట్ లిస్ట్‌ను విడుదల చేస్తారు. అదేరోజున సెలక్షన్ జాబితా వెల్లడిస్తారు. 30న సర్టిఫికెట్లు పరిశీలనతోపాటు, కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుంది.

మంత్రికి చెప్పాం.. ఓకే అన్నారు

- భవిత కేంద్రాన్ని స్వాధీనం చేసుకున్న పంచాయతీరాజ్ శాఖ
- కార్యాలయంలో ఇష్టారాజ్యంగా మార్పులు



పీఆర్ పీఐయూ సబ్ డివిజన్ కార్యాలయంగా మారిన భవిత భవనం

ఆత్మకూరు: పంచాయతీరాజ్ శాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రత్యేకావసరాల పిల్లలకు శిక్షణ ఇచ్చే భవిత కేంద్రం పట్టణంలో ఉంది. ఇది విద్యాశాఖ పరిధిలో ఉంది. వారం రోజుల క్రితం పంచాయతీరాజ్ శాఖలోని పీఐయూ విభాగం వారు సదరు భవనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కొంతకాలంగా ఆ కేంద్రంలో పిల్లలకు శిక్షణ ఇవ్వకపోవడం, ఖాళీగా ఉందని పీఆర్ అధికారులు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆయన మౌఖిక ఆదేశాలతోనే ఆ భవనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక విద్యాశాఖ సిబ్బంది చెబుతున్నారు. కాగా భవిష్యత్‌లో ప్రత్యేకావసరాలు గల పిల్లలకు శిక్షణ ఇచ్చేందుకు, వారికి సంబంధించిన వస్తువులను భద్రపరిచేందుకు మరో భవనం విద్యాశాఖకు లేదు. ఇదిలా ఉండగా స్వాధీనం చేసుకున్న ఆ కేంద్రంలో రెండురోజులుగా మార్పులు సైతం చేస్తున్నారు. ఈ విషయమై ఎంఈఓ ఎం.జ్యోతిని సంప్రదించగా భవిత కేంద్రాన్ని పీఆర్ శాఖకు అప్పగించాలని జిల్లా విద్యాశాఖాధికారి నుంచి తమకు ఆదేశాలు అందలేదన్నారు. పీఆర్ శాఖ అధికారులను అడిగితే మంత్రి ఆదేశాలతో భవనాన్ని తీసుకున్నామని, తాత్కాలికంగా ఉపయోగించుకుంటామని చెప్పారు. అయితే తాత్కాలికంగా నిర్వహించుకునే క్రమంలో ఇష్టారాజ్యంగా మార్పులు, చేర్పులు చేయడం సరికాదని చెప్పినా పట్టించుకోవడంలేదని విద్యాశాఖ సిబ్బంది పేర్కొంటున్నారు.



ప్రత్యేకాలంకరణలో గంగమ్మ తల్లి

వైభవంగా పోలేరమ్మకు పొంగళ్లు



పొంగళ్లు పెడుతున్న మహిళలు

సంగం: మండల కేంద్రమైన సంగమేశ్వరాలయం పక్కన ఉన్న గంగమ్మ తల్లి ఆలయంలో ఆదివారం మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టారు. వార్షికోత్సవంలో భాకంగా అమ్మవారిని పూలతో అలంకరించారు. మహిళలు ఆలయానికి విచ్చేసిన పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు.

ఆర్థిక సాయం అందజేత



కావలి: స్థానిక ఆర్టీసీ డిపోలో కండక్టర్లుగా పనిచేస్తూ అనారోగ్యంతో బాధపడుతున్న ధనలక్ష్మి, ఒంగోలు హరికృష్ణలకు తోటి ఉద్యోగులు అండగా నిలిచారు. కండక్టర్లు తాము సేకరించిన రూ.80,000లను ఆదివారం డిపో అధికారులతో కలిసి బాధితుల ఇళ్లకు వెళ్లి అందజేశారు.

గ్రూప్-2 పరీక్షలు నిర్వహించడం సరికాదు




మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

ఆత్మకూరు: గ్రూప్–2 మెయిన్స్‌ను వాయిదా వేయాలని అనేకమంది అభ్యర్థులు మొత్తుకున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా రోస్టర్ పాయింట్‌పై వివరణ ఇవ్వకుండానే పరీక్షలు నిర్వహించడం సరికాదని ఆంధ్ర విద్యార్థి సంఘం (ఏవీఎస్) రాష్ట్రాధ్యక్షుడు మల్లవరపు అశోక్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరులో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో గ్రూప్–2 పరీక్ష రాసే నిరుద్యోగులు పెద్దఎత్తున ఆందోళనలో ఉంటే ఆ విషయాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించిందన్నారు. రోస్టర్ పాయింట్లు సక్రమంగా లేకుండా పరీక్షలు నిర్వహిస్తే అవి రాసిన అభ్యర్థులు కూడా భవిష్యత్‌లో ఉద్యోగాలు లేకుండా న్యాయస్థానాల చుట్టూ తిరుగుతూ ఉండే పరిస్థితి నెలకొంటుందన్నారు.

ఉత్సవాలకు వేళాయె..







కావలి: పట్టణంలోని పాతవూరులో తుళవ రాజులు నిర్మించిన శివాలయం భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. శ్రీదుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి భక్తుల నీరాజనాలందుకుంటున్నారు. రాచరికపు సంప్రదాయంతో నిర్మించిన రాష్ట్రంలోని ప్రాచీన శైవ క్షేత్రాల్లో ఒకటిగా ఇది వెలుగొందుతోంది. ఇక్కడ తుళవ రాజుల కాలం నాటి శాసనం కూడా ఉంది. 1515 సంవత్సరంలో హరహరరాయలు ఉదయగిరి దుర్గానికి వచ్చి సముద్ర స్నానానికెళ్తూ స్వామిని దర్శించుకున్నట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. ఆదిశంకరాచార్య గురుకుల సంప్రదాయంలో అర్చనలు చేస్తున్నారు. రాజ మహాగణపతి ఆలయం, మహానంది (తిరుగుడు నంది), సప్తమాతృకలు, షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర, రాజదుర్గాదేవి, కాలభైరవ, నాగసుబ్రహ్మణ్యేశ్వర, నవగ్రహ, చండీశ్వర, సరస్వతీదేవి, కేశవస్వామి, బ్రహ్మసత్య భాస్కర ఆలయాలున్నాయి. అమరశిల్పి జక్కన్న వంశీయులు అద్భుత కళా నైపుణ్యం ప్రదర్శించి ఎంతో సుందరంగా విగ్రహాలను తీర్చిదిద్దారు. మహాశివరాత్రి సందర్భంగా ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తారు. వేలాది మంది భక్తులు పాల్గొంటారు. కావలి పట్టణవాసులే కాక చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వారికి శివయ్య ఇలవేల్పు అయ్యాడు. ఈనెల 26వ తేదీ శివరాత్రి సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. మార్చి 2వ తేదీ వరకు వేడుకలు నిర్వహించనున్నారు. నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

బస్‌షెల్టర్ లేక ఇక్కట్లు



బస్సు కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు (ఫైల్)

అనుమసముద్రంపేట: మండలంలోని తెల్లపాడు గ్రామంలో బస్‌షెల్టర్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో సంవత్సరాల క్రితం ఏఎస్‌పేట – ఆత్మకూరు ప్రధాన రహదారి వద్ద తెల్లపాడు ఎస్సీకాలనీ వద్ద బస్‌షెల్టర్‌ను నిర్మించారు. ప్రస్తుతం అది కూలిపోయింది. నూతన బస్‌షెల్టర్ నిర్మిస్తామని అధికారులు చెబుతున్నా ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. దీంతో విద్యార్థులు, ఇతర ప్రాంతాలకు ప్రయాణం చేసేవారు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. బస్సు కోసం ఎండలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, మండల అధికారులు స్పందించి బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జ్ఞానజ్యోతితో చిన్నారుల భవితకు పునాది

- మారనున్న అంగన్‌వాడీ చదువులు
- అభ్యసనా లోపాలు సవరించడమే లక్ష్యం



అంగన్‌వాడీలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ (ఫైల్)

సీతారామపురం: చిన్నారుల కోసం కేంద్ర ప్రభుత్వం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అంగన్‌వాడీ కేంద్రాలపై దృష్టి పెట్టింది. జాతీయ విద్యా విధానం అమల్లో భాగంగా అంగన్వాడీ కేంద్రాలు ప్రీ ప్రైమరీ స్కూళ్లగా మారబోతున్నాయి. 3 – 6 ఏళ్ల మధ్య వయసున్న చిన్నారులకు ఆటపాటలతో కూడిన చదువులు అందించేలా జ్ఞానజ్యోతి పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు అనుగుణంగానే కేంద్రాల్లో సరికొత్త చదువులకు విద్యాశాఖ అధికారులు పటిష్టమైన కార్యాచరణ సిద్ధం చేశారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే పటిష్ట పునాదులు

చిన్నారుల శ్రేయస్సు కోసం నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాలు వారి భవితకు దిక్సూచిగా నిలవాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బలమైన పునాదులు వేసింది. నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీల్లో సైతం మౌలిక వసతులు పెంపొందించడంతోపాటు ప్రతి కేంద్రానికి ఆటవస్తువుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించింది.

ప్రత్యేక శిక్షణ

అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈనెల 18 నుంచి జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. మొదటి విడత శిక్షణ 20వ తేదీతో ముగియగా, రెండో విడత మొదలైంది. పిల్లల ప్రాథమిక అభ్యసనాన్ని మెరుగుపరిచేలా ప్రత్యేక శిక్షణా తరగతులకు సాల్ట్ ప్రోగ్రాం సాంకేతిక సహకారం అందిస్తుంది. ప్రీ ప్రైమరీ, 1, 2 తరగతులను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా అంగన్‌వాడీలకు మెళకువలు నేర్పిస్తున్నారు.

పక్కాగా తరగతులు



జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా ప్రీ ప్రైమరీ స్కూళ్లపై ఫోకస్ పెట్టాం. వివిధ ప్రోగ్రాంలలో భాగంగా ఇప్పటికే 1, 2 తరగతులు బోధించే ఉపాధ్యాయులు శిక్షణ పొందారు. ఇప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తలకు 120 సర్టిఫికెట్ కోర్సుల్లో భాగంగా శిక్షణ ఇస్తున్నాం. ఇందులో మెరుగైన ఫలితాలు వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం.
– షేక్ మస్తాన్‌వలీ, ఎంఈఓ, సీతారామపురం

సులభతర బోధనకు శిక్షణ



ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పూర్వ, ప్రాథమిక విద్యాబోధన జరుగుతోంది. అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రాథమిక విద్యను 1, 2 తరగతుల చిన్నారులకు సులభతరంగా బోధించుటకు జ్ఞానజ్యోతి శిక్షణ ఎంతగానో దోహదపడుతుంది.
– సునీత, ఇన్‌చార్జి సీడీపీఓ, ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్

ఎంతో ఉపయోగం



చిన్నారుల చదువులకు తొలి అడుగులు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పడతాయి. అక్కడి నుంచే స్కూళ్లకు వస్తారు. అందువల్లే ప్రీ ప్రైమరీ స్థాయిలోనే నైపుణ్యతతో కూడిన చదువులు అందించేందుకు ఇటువంటి శిక్షణ ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది.
– షేక్.షాను, ఐసీడీఎస్ సూపర్‌వైజర్

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

నెల్లూరు(బృందావనం): జిల్లాలోని పెన్షనర్లు తమ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పెన్షనర్ల జిల్లా ఆడిట్ అధికారి తిరుపతయ్య పేర్కొన్నారు. భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్ల సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్సెమ్ గౌస్ మాట్లాడారు. పెన్షనర్లకు రావాల్సిన డీఆర్, 11వ పీఆర్సీ తదితర బకాయిల విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఎనెల్ హాస్పిటల్ జనరల్ ఫిజీషియన్ హరికృష్ణ, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణయ్య, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రఘునాథ్, అటవీ విభాగ అధ్యక్షుడు ప్రసాద్, ఆత్మకూరు, పొదలకూరు యూనిట్ల అధ్యక్షులు శ్రీరాములు, కోటేశ్వరరావు, కార్యదర్శి సుధాకర్, అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్, ధీరేంద్రనాథ్, ఫయాజ్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి ఎస్వీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.